క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తాడేపల్లి రూరల్: మంగళగిరి పట్టణ ప్రాంత పరిధిలోని కొన్ని ప్రాంతాల్లో గురువారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ డీఈ అక్కల సత్యనారాయణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 33/11 కేవీ మంగళగిరి విద్యుత్ ఉపకేంద్రం పరిధిలోని టౌన్–3 ఫీడర్ మరమ్మతుల నిమిత్తం ఉదయం 6 నుంచి 9 గంటల వరకు చిన్న పంజా వీధి, గౌతమ్ బుద్ధ రోడ్, అభిరుచి హోటల్, పెద కోనేరు, ఇస్లాంపేట, సీకే కాలేజీ వెనుక ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

ఎస్వీ రంగారావుకు ఘన నివాళి



సత్తెనపల్లి: ప్రముఖ నటుడు ఎస్వీ రంగారావు జయంతి వేడుకలు పట్టణంలోని ఎన్టీఆర్ కళా క్షేత్రం ఎదుట బుధవారం ఘనంగా జరిగాయి. బి. సుబ్బారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డాక్టర్ రావూస్ వైద్యశాల డాక్టరు వి. కృష్ణంశెట్టి, రాజుపాలెం మాజీ జడ్పీటీసీ మర్రి వెంకట్రామిరెడ్డి, నరిశేటి తాండవకృష్ణలు ప్రసంగించారు. ఎస్వీఆర్ నటనను కొనియాడారు. ముందుగా ఎస్వీ రంగారావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కళాకారులు గంగూరి వెంకట్రావు, బత్తుల సుధాకర్, తోట ఏడుకొండలు, దివ్వెల శ్రీనివాసరావు, కేదారి రమేష్, శిఖ ఆదాం, రామిశెట్టి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనల ప్రకారమే ల్యాబ్‌ల నిర్వహణ

సత్తెనపల్లి: పట్టణంలో నిబంధనలకు అనుగుణంగానే ల్యాబ్‌ల నిర్వహణ ఉందని ల్యాబ్ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు షేక్ నాసర్ బాషా, కార్యదర్శి గద్దం వీరాంజనేయులు పేర్కొన్నారు. అసోసియేషన్ సర్వసభ్య సమావేశం బుధవారం పట్టణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నాసర్ బాషా మాట్లాడుతూ పట్టణంలో అన్ని ల్యాబ్‌లకు అనుమతులు ఉన్నాయని చెప్పారు. కొంతమంది సామాజిక మాధ్యమాల్లో అసత్య ఆరోపణలు చేస్తున్నారని, ఇది సరైనది కాదని ఖండించారు. సమావేశంలో అసోసియేషన్ సభ్యులు, తదితరులు ఉన్నారు.

ఉపాధి హామీ కింద పండ్లతోటల పెంపకం



రాజుపాలెం : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా సన్న, చిన్నకారు రైతులు పండ్లతోటలు వేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని ఎంపీడీవో ఎన్ రామకృష్ణప్రసాద్, ఏపీవో సీహెచ్ వెంకటేశ్వర్లులు తెలిపారు. మండలంలోని అంచులవారిపాలెం, అనుపాలెం గ్రామాలలో ఉపాధిహామీ పథకం కింద వేసిన పండ్ల తోటలను రైతులతో కలసి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఏపీవో మాట్లాడుతూ ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాన్ని ఐదెకరాల లోపు పొలం ఉన్న రైతులు ఉపయోగించుకోవాలని కోరారు. వారు జాబ్ కార్డు కూడా కలిగి ఉండాలని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగం లేనివారికే ఈ అవకాశం ఉందని చెప్పారు. పండ్లతోట వేసుకునే రైతులు శాశ్వత నీటి సౌకర్యం, బోరు బావులు కలిగి ఉండాలని తెలిపారు. మండలంలోని 17 ఎకరాలలో పండ్ల తోటలు వేశారని చెప్పారు. మామిడి, జీడి మామిడి, బత్తాయి, కొబ్బరి, మునగ, సపోట, దానిమ్మ, డ్రాగన్ ఫ్రూట్స్, జామ, తైవాన్ జామ, నిమ్మ, నేరేడు, యాపిల్‌బేర్, అంజూర మొదలైన తోటలు వేసుకోవచ్చని తెలిపారు. పూల తోటల పెంపకం కింద గులాబీలు, గుండుమల్లెలు వేసుకోవచ్చని పేర్కొన్నారు. ఆసక్తిగల రైతులు మండల పరిషత్ కార్యాలయంలోని ఎండీవోను, ఏపీవోను సంప్రదించాలని కోరారు.

యూపీలో తొక్కిసలాట ప్రభుత్వ వైఫల్యమే

పొన్నూరు: ఉత్తరప్రదేశ్‌లోని హత్రాస్‌లో 'భోలే బాబా సత్సంగ్'లో జరిగిన తొక్కిసలాటలో వందలాది మంది చనిపోవటం బాధాకరమని పొన్నూరు కాంగ్రెస్ ఇన్‌చార్జ్ జక్కా రవీంద్రనాథ్ అన్నారు. భక్తులు బాబా పాదధూళి కోసం ఒక్కసారిగా రావడంతో జరిగిన తొక్కిసలాట దృశ్యాలు కలచివేశాయని అన్నారు. ఈ ఘటనకు ప్రభుత్వ వైఫల్యమే కారణమని ఆరోపించారు. హిందువైనందుకు గర్వపడుతున్నామంటూ చెప్పుకుంటున్న మోదీ–యోగీలు ప్రభుత్వాలను నడిపి, ప్రజలను పాలించమంటే ఎక్కడలేని అసమర్థత ప్రదర్శిస్తుంటారని విమర్శించారు. ఇంత పెద్ద మృత్యుహేళ జరిగినప్పటికీ ఇద్దరిలో చలనం లేకపోవటం దేశ ప్రజలు చేసుకున్న దురదృష్టం అని అన్నారు.

రసాయనం.. అతిగా వాడితే అనర్థం!

- రసాయన మందుల పిచికారీలో జాగ్రత్తలు అవసరం
- మోతాదుకు మించితే పంట దిగుబడికే తీవ్ర నష్టం
- రైతులు జాగ్రత్తలు పాటించాలంటున్న వైద్యులు, అధికారులు



పంటకు పిచికారీ చేస్తున్న రైతు

తాడేపల్లి రూరల్: ఆధునిక టెక్నాలజీ పెరుగుతున్నా... వ్యవసాయం మాత్రం 'వ్యయ'సాయంగా మారింది. రైతులు సరికొత్త పద్ధతుల్లో పంటల సాగు చేయడంతో రసాయనిక పురుగు మందుల వినియోగం కూడా రోజురోజుకూ పెరిగిపోతోంది. విత్తనాలు చల్లడం నుంచి పంట కోతకు వచ్చే వరకూ పురుగుమందు వాడకంపై రైతులు తప్పని సరిగా అవగాహన కలిగి ఉండాలి. లేని పక్షంలో పంట దిగుబడి దెబ్బతినడంతో పాటు రైతు నష్టాలబారిన పడాల్సి వస్తుంది. అధికంగా పురుగు మందులు వినియోగిస్తే ప్రమాదమని వ్యవసాయ శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. మోతాదుకు మించి రసాయన ఎరువులు, క్రిమి సంహారక మందులు వినియోగిస్తే పంటపై ప్రభావం పడుతుందని, తప్పకుండా రైతులు వ్యవసాయ సిబ్బంది సలహాలు, సూచనలు పాటించాలని తెలియజేస్తున్నారు.

క్రిమి సంహారక మందులు, రసాయనిక ఎరువులు అధికంగా వినియోగిస్తే భూసారం తగ్గడంతో సహజత్వాన్ని కోల్పోతాయి. దీంతో లాభం కంటే నష్టం అధికంగా ఉంటుంది. పంటలకు నీటితడి అందించిన తర్వాత ఉదయం వేళల్లో పంటలకు పిచికారీ చేస్తే ఫలితం ఉంటుంది. 25 డిగ్రీల ఉష్ణోగ్రత ఉన్న సమయంలో పంటలకు పిచికారీ చేయాలి. రైతులు పలు జాగ్రత్తలు తీసుకుని పిచికారీ చేస్తే ప్రమాదాల నుంచి గట్టెక్కవచ్చని ఇటు వైద్యులు, అటు వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.

రసాయనాలు పిచికారీ చేసే సమయంలో ఈ జాగ్రత్తలు తీసుకోవాలి...

- గాలికి ఎదురుగా రసాయన మందులు పిచికారీ చేయరాదు.
- తెగులు మందు, పురుగుమందు కలిపి పిచికారీ చేయరాదు.
- చేతలకు గ్లౌజులు, నోరు, ముక్కుకు మాస్కులు వేసుకోవాలి.
- మందులు పిచికారీ చేసే సమయంలో కళ్లు, ముక్కు, నోరు, చేతులతో రుద్దుకోరాదు. వాడిన పురుగు మందుల డబ్బాలు ఎక్కడబడితే అక్కడ వేయరాదు.
- రసాయన మందులు పిచికారీ సమయంలో స్ప్రేయర్లకు లీకేజీ ఉండరాదు.
- ద్రావణం కలిపే మందు డబ్బాపై సూచించిన మేరకు గానీ, వ్యవసాయ అధికారులు సూచించిన మేరకు గానీ పిచికారీ చేయాలి.
- పిచికారీ చేసే సమయంలో బీడీలు, సిగరెట్లు తాగరాదు.
- భోజనానికి ముందు చేతులు సబ్బుతో శుభ్రం చేసుకోవాలి.
- రసాయన మందు పిచికారీ చేసే సమయంలో కడుపుమంట, దద్దుర్లు వస్తే సమీపంలో ఉన్న వైద్యుడిని సంప్రదించాలి.

జాగ్రత్తలు పాటించాలి



పంటలపై క్రిమి సంహారక మందులు పిచికారీ చేసే సమయంలో రైతులు తప్పని సరిగా జాగ్రత్తలు పాటించాలి. అస్వస్థతకు గురైన వెంటనే సమీపంలోని వైద్యుడిని సంప్రదించాలి. పురుగుమందు పిచికారీ చేసే సమయంలో కళ్లు, ముక్కు, నోటిలోకి రసాయన మందు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. చేతులను శుభ్రంగా కడుక్కుని భోజనం చేయాలి. లేకుంటే రసాయన ద్రావణం లోపలికి వెళ్లే ప్రమాదం ఉంది.

–డాక్టర్ అబ్దుల్ రహమాన్, దుగ్గిరాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు

మోతాదుకు మించి వాడరాదు



వ్యవసాయ సిబ్బంది సూచించిన మేరకు తగిన మోతాదులో పంటకు ఉదయం వేళల్లో పిచికారీ చేయాలి. ముఖానికి మాస్కులు, చేతులకు గ్లౌజులు, కళ్లకు అద్దాలు ధరించి పిచికారీ చేయాలి. కలుపుమందు కొట్టిన తరువాత పురుగుమందు కొట్టరాదు. మొక్కల పై భాగంతో పాటు కిందభాగం తడిసిపోయేలా పిచికారీ చేస్తే ఆకు కింద ఉన్న రసం పీల్చే పురుగులు నశిస్తాయి.

–శ్రీనివాస్ రెడ్డి, అగ్రికల్చర్ ఏడీ

ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం



ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న దివ్యాంగులు

తాడేపల్లి రూరల్: మంగళగిరి నియోజకవర్గ పరిధిలోని దివ్యాంగులు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చిత్రపటానికి టీడీపీ కార్యాలయం ఎదుట బుధవారం పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా మంగళగిరి నియోజకవర్గ దివ్యాంగుల సంఘం అధ్యక్షులు పిన్నెబోయిన అజయ్‌కుమార్ మాట్లాడుతూ గతంలో రూ.3 వేల పెన్షన్ వచ్చేదని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రూ.6 వేలకు పెంచారని అన్నారు. వల్లభనేని వెంకట్రావు మాట్లాడుతూ జూలై నెలకు సంబంధించి రూ.4 వేలు, ఏప్రిల్, మే, జూన్ మాసాలకు సంబంధించి రూ.3 వేలు కలిపి మొత్తం రూ.7 వేలు సచివాలయ సిబ్బంది పింఛను లబ్ధిదారులకు అందజేశారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ తాడేపల్లి పట్టణ ప్రధాన కార్యదర్శి దారా దాసు, రాష్ట్ర టీఎన్టీయూ అధికార ప్రతినిధి అద్దంకి మురళి, మాజీ కౌన్సిలర్ ఇట్టా భాస్కర్, తాడిబోయిన భాస్కర్, గోపి, షేక్ అమీర్, కొమర బచ్చయ్య, వల్లపాటి శ్రీనివాస్, సీమోన్, సింహాచలం, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కళాకారులకు పింఛన్లు మంజూరు చేయాలి

ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్య మండలి గుంటూరు జిల్లా కార్యదర్శి ఆరేటి రామారావు



మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి రామారావు

తెనాలి: రాష్ట్రంలోని కళాకారులకు గుర్తింపు కార్డులు, పింఛన్లు వెంటనే మంజూరు చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రజా నాట్యమండలి గుంటూరు జిల్లా కార్యదర్శి ఆరేటి రామారావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో బుధవారం జరిగిన ప్రజానాట్య మండలి కళాకారుల సమావేశానికి జిల్లా అధ్యక్షుడు బొల్లిముంత కృష్ణ అధ్యక్షత వహించారు. రామారావు మాట్లాడుతూ జానపద, పౌరాణిక, సాంఘిక, ఔత్సాహిక కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. ప్రజలను చైతన్య పరిచేందుకు కళారూపాల అవసరం ఎంతగానో ఉందన్నారు. గ్రామ గ్రామాన ప్రదర్శనలిచ్చి ప్రజల్లో మార్పు తీసుకురావాలని అందుకు ప్రభుత్వం పూనుకుని కళా సంస్థలు, కళాకారులకు సహాయ సహకారాలు అందించాలని కోరారు. కళా ప్రదర్శనలకు వెళ్లే కళాకారులకు బస్సు, రైలులో రాయితీలు కల్పించాలని సూచించారు. గతంలో నాటక ప్రదర్శనలకు వెళ్లే కళా సంస్థలకు రాయితీలు ఇచ్చేవారని, తర్వాతి కాలంలో ఆ సౌకర్యాన్ని తొలగించారని రామారావు గుర్తుచేశారు. వెంటనే రాయితీలను పునరుద్ధరించాలని కోరారు. ఈ నెల 7న ఉదయం 10 గంటలకు గుంటూరు కార్యాలయంలో జరిగే సభకు అధిక సంఖ్యలో కళాకారులు తరలిరావాలని కోరారు. ప్రజానాట్య మండలి జిల్లా సమితి సభ్యులు దేవరపల్లి సీలాంబ్రం, ముక్కాల మాణిక్యారావు, విజయదుర్గ, విజయలక్ష్మి, వీణ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అవగాహన కార్యక్రమం



రైతులకు సీసీఆర్సీ కార్డుపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారి పి. శిరీష

తాడేపల్లి రూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని చిలువూరు, కంఠం రాజు కొండూరు గ్రామాల్లో రైతులకు కౌలు కార్డుల గురించి అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన వ్యవసాయ అధికారి పి. శిరీష రైతులతో మాట్లాడుతూ పంట సాగుదారుల హక్కుల కార్డులు ప్రతి ఒక్కరి కలిగి ఉండాలని సూచించారు. పంట నమోదు, సబ్సిడీపై ఎరువులు, పంట నష్టం వాటిల్లినపుడు బీమా లేదా ఇన్‌పుట్ సబ్సిడీ, సున్నా వడ్డీ రుణాలు మొదలైన పథకాలకు ఈ కార్డు అవసరమని అవగాహన కల్పించారు. రైతులకు కావలసిన వరి బీపీటీ–5204 విత్తనాలు అన్ని రైతు భరోసా కేంద్రాల వద్ద అందుబాటులో ఉంచామని తెలిపారు. కావాల్సిన రైతులు ఆధార్‌కార్డు, పాస్‌బుక్ జిరాక్స్ కాపీలు తీసుకుని సంబంధిత రైతు సేవా కేంద్రంలో సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో వీఏఏలు లావణ్య, శిరీష, ఇందిర, ఏఈవో రమేష్‌బాబు, వీఆర్వోలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

వానల వేళ.. జాగ్రత్త పడాలి చాలా...

సత్తెనపల్లి: వర్షాలకు సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఈ కాలంలోనే డెంగీ, మలేరియా పెరిగే ప్రమాదం ఉంది. జ్వరాలతో ఆసుపత్రులకు వచ్చే వారి సంఖ్య పెరుగుతోంది. వ్యాధులపై వైద్య సిబ్బంది అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రజలు ఇళ్లల్లో కొద్దిపాటి జాగ్రత్తలు తీసుకుంటే వ్యాధుల బారిన పడకుండా రక్షించుకోవచ్చని వైద్యులు చెబుతున్నారు. ఇంటితోపాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా వ్యాధులు ప్రబలకుండా ఉంటాయి. టైఫాయిడ్, డెంగీ, మలేరియా, కామెర్లు, డయేరియా వంటి వ్యాధులు రాకుండా అరికట్టవచ్చు. పంచాయతీ శానిటరీ విభాగం కూడా ఫాగింగ్, బ్లీచింగ్ పౌడర్ చల్లడం, మురుగు ప్రాంతాల్లో హైపో పిచికారి చేసే ప్రక్రియను ప్రారంభించాల్సి ఉంది.

వైద్య సిబ్బంది విస్తృత అవగాహన...

స్టాప్ డయేరియాలో భాగంగా పణిదం ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో పరిధిలోని ఇంటింటికీ అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు వెళ్తున్నారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు, జింక్ మాత్రలు పంపిణీ చేస్తున్నారు. విస్తృతంగా పర్యటిస్తూ ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. అంతేకాక చేతులు శుభ్రత తదితరాలపై చైతన్యం తెస్తున్నారు. డయేరియా రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్నారు. ఎక్కడైనా జ్వరాలు ఉన్నట్లు అనిపిస్తే వెంటనే సమీపంలోని వైద్యశాలలకు బాధితులను తరలించేందుకు ఏర్పాట్లు కూడా చేస్తున్నారు.

పోషకాహార లోపంతో ఐక్యూపై ప్రభావం



లాం(తాడికొండ): చిన్నారుల్లో పోషకాహారం లోపించడం వల్ల వారి ఐక్యూ లెవల్స్ ఆశించిన స్థాయిలో పెరగకుండా తీవ్ర ప్రభావం పడుతుందని లాంలోని కృషి విజ్ఞాన కేంద్రం ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ యుగంధర్ కుమార్ అన్నారు. తాడికొండ మండలం లాం అంగన్‌వాడీ సెక్టార్‌లోని కేంద్రంలో నిర్వహించిన అవగాహనా సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2 సంవత్సరాల లోపు చిన్నారులకు సమీకృత పౌష్టికాహారం అందించడం ద్వారా వారిలో సామర్థ్యం పెంచవచ్చన్నారు. పోషకాహార లోపం వల్ల చిన్నారులు అన్ని రంగాలలో వెనుకబడే ప్రమాదం ఉందన్నారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులకు రాగి, కొర్రల మిశ్రమంలో బెల్లం కలిపిన పౌష్టికాహారాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్త దీపా, ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజర్ సీహెచ్ కళావతి, ఎంఎస్‌కే సునీత, కార్యకర్తలు చిన్నారులు, తల్లులు పాల్గొన్నారు.

వాహనాల ద్వారా రేషన్ బియ్యం పంపిణీ



ఫిరంగిపురం: మండలంలోని 18 గ్రామాల్లోని 20,873 మంది రేషన్ కార్డుదారులకు ఎండీయూ వాహనాల ద్వారా బియ్యం పంపిణీ చేస్తున్నట్లు సీఎస్‌డీటీ అనిల్ బుధవారం తెలిపారు. మండలంలో మొత్తం 13 వాహనాలు ఉండగా, వాటి ద్వారా కార్డుదారులకు రేషన్ బియ్యం పంపిణీ చేస్తున్నామని చెప్పారు. కాగా ప్రతి నెలా రేషన్ బియ్యంతోపాటు కందిపప్పు, పంచదార ఇచ్చారు. ఈ నెల వాటిని ఇవ్వకపోవడంతో కార్డుదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

మహాసభ కరపత్రాల ఆవిష్కరణ



సత్తెనపల్లి: మాదిగ జన జాతర మహాసభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీస్ సీనియర్ నాయకుడు రెడ్డెబోయిన ప్రసన్నకుమార్ మాదిగ పిలుపునిచ్చారు. పట్టణంలోని డాక్టర్ బాబు జగజ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద బుధవారం జన జాతర కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రసన్నకుమార్ మాదిగ మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ 30వ వార్షికోత్సవం సందర్భంగా ఈదుమూడి గ్రామంలో వ్యవస్థాపకుడు ఉసురు పాటి బ్రహ్మయ్య మాదిగ నాయకత్వంలో సత్తెనపల్లి నియోజకవర్గ అధ్యక్షుడు చింతపల్లి గంగాధర్ ఆధ్వర్యంలో 7న జరిగే ఈ కార్యక్రమానికి నియోజకవర్గం నుంచి అధిక సంఖ్యలో నాయకులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా కన్వీనర్ పేరు పోగు రామయ్య మాదిగ, పల్నాడు జిల్లా కో కన్వీనర్ గుండాల నగేష్ మాదిగ, సత్తెనపల్లి నియోజకవర్గ నాయకుడు చింతపల్లి నాగరాజు మాదిగ, గర్నెపూడి ఆనంద్ మాదిగ, దారా మరియదాస్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

కౌలు గుర్తింపు కార్డుల జారీకి వినతి



శిరీషకు వినతిపత్రం అందజేస్తున్న కౌలు రైతు సంఘం నాయకులు

తాడేపల్లిరూరల్: కౌలు చేసుకునే రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరుతూ దుగ్గిరాల వ్యవసాయ శాఖ అధికారి పి. శిరీషకు కౌలు రైతు సంఘం నాయకులు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం మండల కార్యదర్శి మన్నవ నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ గత ప్రభుత్వం కౌలు రైతులకు తెచ్చిన 2019 చట్టాన్ని రద్దు చేసి 2011 చట్టం ప్రకారం భూ అధీకృత రైతుల చట్టం అమలు చేయాలన్నారు. రాష్ట్రంలోని 80 శాతం కౌలు, సన్న, చిన్న కారు రైతులు సాగు చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వమే గ్రామ సభల ద్వారా కౌలు రైతులను గుర్తించి దరఖాస్తులు స్వీకరించాలని కోరారు. దేవదాయ భూమి 10 ఎకరాలు ఐదుగురు పాట పాడుకున్నచోట ఒక్కొక్కరికి రెండు ఎకరాల చొప్పున చేస్తున్న వారికి కూడా కౌలు గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు జెట్టి బాలరాజు, కౌలు రైతు సంఘం మండల అధ్యక్షులు బి.అమ్మిరెడ్డి, టి. రామారావు, కె. దావీదు, ఎస్. రాంబాబు, ఎస్. మంగయ్య, కె. మోహన్‌రావు, జె. బుజ్జి, కె. పాల్ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

తిరుమల మొక్కులు చెల్లింపునకు అమరావతి రైతులు



రైతుల బస్సుకు జెండా ఊపి సాగనంపుతున్న ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్

తాడికొండ: అమరావతి ఏకైక రాజధానిగా ఉండాలంటే టీడీపీ అధికారంలోకి రావాలంటూ మొక్కుకున్న అమరావతి రైతులు బుధవారం తమ మొక్కులు చెల్లించుకునేందుకు తిరుమల తిరుపతి దేవస్థానానికి పయనమయ్యారు. సమారు 200 మందికి పైగా రైతులు బస్సులు, కార్లలో బయలుదేరగా తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ జెండా ఊపి బస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమరావతిని ఏకైక రాజధానిగా చూడాలని దీక్షబూనిన రైతులు ఆ దిశగా కఠోర దీక్ష చేసి దేవుళ్లకు మొక్కుకొని టీడీపీని అధికారంలోకి తెచ్చుకున్నారని తెలిపారు. ఆ సందర్భంగా మొక్కులు చెల్లించుకునేందుకు వెళ్లడం శుభ పరిణామం అన్నారు. కార్యక్రమంలో తాను పాలుపంచుకోవడం ఆనందంగా ఉందని చెప్పారు. అమరావతే ఏకైక రాజధాని కావాలని అందరూ కోరుకున్నందునే నేడు అది నెరవేరిందని వ్యాఖ్యానించారు.

విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయాలి



విద్యాసంస్థ యాజమాన్యానికి నోటీసు అందజేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

తాడేపల్లి రూరల్: పలు విద్యార్థి సంఘాలు సంయుక్తంగా గురువారం తలపెట్టిన విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు బుధవారం విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నీట్ పేపర్ లీకేజీని నిరసిస్తూ సంఘాల ఆధ్వర్యంలో తలపెట్టిన బంద్‌ను జయప్రదం చేయాలని కోరారు. మంగళగిరి నియోజకవర్గ పరిధిలోని అన్ని పాఠశాలలు, కాలేజీల ప్రిన్సిపల్స్‌కు నోటీసులు అందజేశామని తెలిపారు. బీజేపీ ప్రభుత్వం నీట్ నిర్వహణలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. విద్యార్థుల జీవితాలతో చెలగాటాలు ఆడుతూ వారి భవిష్యత్తును శూన్యం చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. నీట్ స్కాంపై సమగ్ర దర్యాప్తు నిర్వహించి దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ మంగళగిరి నియోజకవర్గ కన్వీనర్ యార్లగడ్డ శివ గోపి, కో కన్వీనర్ మత్తె అభిషేక్, పట్టణ అధ్యక్షులు ఆళ్లమూడి హానోక్‌బాబు, ఎం. మణికంఠ, సీహెచ్ ధర్మతేజ, యార్లగడ్డ మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

మెకానిక్‌లకు ప్రభుత్వం అండగా ఉండాలి



ప్రపంచ మెకానిక్స్ దినోత్సవాలలో అసోసియేషన్ కార్యవర్గం

తాడేపల్లి రూరల్ : శ్రామికుల టూ వీలర్స్ మెకానిక్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం ప్రపంచ మెకానిక్స్‌డే ను మంగళగిరి పట్టణ పరిధిలోని అంజుమన్ షాదిఖానాలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టూ వీలర్ యూనియన్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు ఆసీఫ్ అలీ మాట్లాడుతూ టూ వీలర్ మెకానిక్‌లకు వెల్ఫేర్ బోర్డును ఏర్పాటు చేయాలని, దాని ద్వారా వృత్తిదారులకు సబ్సిడీపై లోన్ అందజేయాలని కోరారు. ప్రతి మెకానిక్ మేస్త్రీకి బీమా వర్తించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నామని తెలిపారు. టూ వీలర్ మెకానిక్‌లకు అసంఘటిత కార్మికుల్లో చేర్చాలని, అందరికీ గుర్తింపుకార్డులు అందజేయాలని పేర్కొన్నారు. యూనియన్ సమావేశ మందిరానికి 10 సెంట్ల స్థలం కేటాయించి, కమ్యూనిటీ హాల్ నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో లేబర్ ఆఫీసర్ మూర్తి, బీయస్6 ఇంజినీర్ ఆనంద్, యూనియన్ అధ్యక్షులు షేక్ సలీం, టీవీ సుబ్బారావు, బి. వాసు, అధ్యక్షులు జి. ప్రభాకరరావు, కమిటీ సభ్యులు, బైక్ మెకానిక్‌లు తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన రోటరీ ప్రతినిధులు



తాడేపల్లి రూరల్: రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి 2024–25 నూతన కార్యవర్గం శ్రీ పానకాల లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం ఘాట్ రోడ్‌లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని బుధవారం చేపట్టింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా దేవస్థానం కార్యనిర్వహణాధికారి అన్నపురెడ్డి రామకోటిరెడ్డి విచ్చేసి శ్రీ పద్మావతి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం ఎదుట ఘాట్ రోడ్‌మార్గం డివైడర్లలో పెద్ద కదంబం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ ప్రతినిధులు మాట్లాడుతూ రోటరీ ఇంటర్నేషనల్ ఏడు ప్రధానాంశాల్లో ఒకటైన పర్యావరణ పరిరక్షణ కోసం శ్రీ పానకాల లక్ష్మీ నరసింహస్వామి ఘాట్ రోడ్‌లో మొక్కలు నాటామని, పర్యావరణ ఆవశ్యకతను యువత గుర్తించాలన్నారు. అనంతరం రోటరీ ఇంటర్నేషనల్ 3150 రోటరీ డిస్ట్రిక్ట్ పీడీజీ అన్నెరత్న ప్రభాకర్ జన్మదిన వేడుకలను లిటిల్ విలేజ్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంగళగిరి రోటరీ క్లబ్ అధ్యక్షులు గాజుల శ్రీనివాసరావు, క్లబ్ ట్రెనర్ అనిల్ చక్రవర్తి, కార్యదర్శి అందె మురళీమోహన్, కోశాధికారి వడ్లమూడి శ్రీనివాసరావు, సర్వీస్ ప్రాజెక్టు డైరెక్టర్ కాపరౌతు సుందరయ్య, పాస్ట్ క్లబ్ అధ్యక్షులు అందె రేవంత్ కుమార్, చనుమోలు గోపాలరావు, కేవీఎస్ ప్రకాశరావు, అవ్వారు ఫణికుమార్, కొతరపు వేణుగోపాల్, ఉడతా శ్రీనివాసరావు, తాడేపల్లి, చిలకలూరిపేట, పండరీపురం, తెనాలి, పెదనందిపాడు రోటరీ క్లబ్ ప్రతినిధులు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బాబాల మూఢత్వ ప్రచారాన్ని ఆపాలి

గుంటూరు ఎడ్యుకేషన్: దేశ వ్యాప్తంగా అనేక మంది బాబాలు ప్రజల్లో మూఢత్వాన్ని, అశాస్త్రీయ ధోరణులను ప్రచారం చేస్తున్నారని జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి.జాన్ బాబు, బి.ప్రసాద్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. బాబాలు చేస్తున్న అశాస్త్రీయ ధోరణులతో అమాయక ప్రజలు అనేక రకాలుగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉత్తరప్రదేశ్‌లోని హత్రాస్‌లో భోలేబాబా పాతధూళి కోసం జరిగిన తొక్కిసలాటలో 116 మంది మరణించడం, వందలాది మంది గాయపడటం బాధాకరమన్నారు. దీనికి కారకులైన బాబాలపై చర్యలు తీసుకోవడంతో పాటు మూఢ నమ్మకాల నిరోధక చట్టాన్ని తేవాలన్నారు.